అప్పుల ప్రధాని మోదీ!

మొదటిపేజీ తరువాయి...

గణాంకాలతో సహా వెల్లడించిన వాస్తవాలు ఇవి.

ప్రశ్న: మోదీ ప్రభుత్వం ఇప్పటివరకూ ఎంత అప్పు చేసింది?

గ్రోక్: 2014లో అధికారంలోకి వచ్చిన ప్పటి నుంచి 2025 వరకూ అంటే గడిచిన 11 ఏండ్లలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రూ. 130.27 లక్షల కోట్ల అప్పు చేసింది. 2014లో మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టకముందు దేశం అప్పు రూ. 55 లక్షల కోట్లుగా ఉన్నది. బీజేపీ పాలనలో అప్పులు రెట్టింపు కంటే ఎక్కువగా నమోదయ్యాయి. అలా మొత్తంగా 2024-25 ఆర్థిక సంవత్సరంనాటికి దేశం మొత్తం అప్పు రూ. 185.27 లక్షల కోట్లకు చేరింది.

ప్రశ్న: దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఏ ప్రధాని హయాంలో ఎక్కువగా అప్పులు తీసుకోవడం జరిగింది?

గ్రోక్: దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి పలువురు ప్రధానులు అప్పులు చేశారు. అయితే మోదీ హయాంలో అంటే 2014-2025 మధ్యలోనే ఎక్కువగా అప్పులు చేయడం జరిగింది. 2014లో దేశం అప్పులు రూ. 55 లక్షల కోట్లుగా ఉంటే 2024-25 నాటికి రూ. 185.27 లక్షల కోట్లకు చేరాయి. అంటే రూ. 130.27 లక్షల కోట్ల అప్పు కేవలం మోదీ హయాంలోనే జరిగింది. సంఖ్యాపరంగా చూస్తే మిగతా ప్రధానులతో పోలిస్తే మోదీ హయాంలోనే అప్పులు పెరిగాయి.

ప్రశ్న: జీడీపీలో దేశ అప్పు ఎంత శాతంగా ఉన్నది?

గ్రోక్: 2025 ఏప్రిల్ నాటికి దేశ జీడీపీ 4.3 ట్రిలియన్ డాలర్లుగా అంచనా వేస్తే.. దేశ అప్పులు రూ. 185.27 లక్షల కోట్లుగా ఉన్నాయి. అంటే జీడీపీలో అప్పుల వాటా 57 శాతంగా చెప్పొచ్చు.

ప్రశ్న: కేంద్ర ప్రభుత్వం చేసిన అప్పును బట్టి దేశంలో ఒక్కో పౌరుడి నెత్తిపై ఎంత అప్పు ఉన్నట్టు?

గ్రోక్: దేశ జనాభా 145 కోట్లుగా తీసుకొంటే, దేశ అప్పు రూ. 185.27 లక్షల కోట్లు కాబట్టి.. ఒక్కో పౌరుడి నెత్తిపై రూ. 1,27,772 అప్పు ఉన్నట్టు భావించవచ్చు. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వాల రుణాన్ని కూడా ఇందులో కలిపితే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మొత్తం రుణం రూ. 270 లక్షల కోట్లకు చేరుతుంది. అప్పుడు ఒక్కో పౌరుడి నెత్తిపై అప్పు రూ. 1,86,207గా ఉంటుంది.

ప్రశ్న: మోదీ ప్రభుత్వ హయాంలో విదేశీ అప్పులు ఎన్ని ఉన్నాయి?

గ్రోక్: మోదీ ప్రభుత్వ హయాంలో 2014 నుంచి 2024 వరకూ విదేశీ అప్పులు కూడా గణనీయంగా పెరిగాయి. 2014లో ప్రధానిగా మోదీ పగ్గాలు చేపట్టినప్పుడు విదేశీ అప్పు రూ. 30 లక్షల కోట్లుగా ఉంటే, 2024 జూన్ నాటికి ఇది రూ. 57 లక్షల కోట్లకు చేరింది. అంటే పదేండ్ల వ్యవధిలో విదేశీ అప్పు రూ. 27 లక్షల కోట్లు పెరిగింది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 67 ఏండ్లలో గత ప్రధానులు విదేశాల నుంచి రూ. 30 లక్షల కోట్ల రుణాలను సేకరిస్తే, కేవలం పదేండ్లలోనే మోదీ సర్కారు విదేశాల నుంచి రూ. 27 లక్షల కోట్లను అప్పుగా తీసుకొంది.



ప్రశ్న: విదేశీ అప్పులు పెరుగుతుండటంతో భారత్‌పై ఏమైనా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉన్నదా?

గ్రోక్: విదేశీ అప్పులు పెరుగుతుండటం ఆందోళనకరమే. రుపాయి పతనం, ట్రంప్ తాజా సుంకాలతో ఎగుమతుల్లో తగ్గుదల, ప్రపంచ దేశాల ఆర్థిక అనిశ్చితులు విదేశీ అప్పుల చెల్లింపుల్లో సవాళ్లను సృష్టించవచ్చు. అయితే, దీని ప్రభావం వెంటనే లేకపోయినప్పటికీ దీర్ఘకాలంలో మాత్రం నష్టాన్నే కలిగిస్తుంది.

మోదీ హయాంలో అప్పులు ఇలా

11 ఏండ్ల అప్పు	రూ. 130.27 లక్షల కోట్లు
ఏడాదికి అప్పు	రూ. 11.84 లక్షల కోట్లు
నెలకు అప్పు	రూ. 98,689 కోట్లు
రోజుకు అప్పు	రూ. 3,289 కోట్లు
గంటకు అప్పు	రూ. 137 కోట్లు
నిమిషానికి అప్పు	రూ. 2.28 కోట్లు
సెకనుకు అప్పు	రూ. 3.8 లక్షలు

సీజేఐ సంజీవ్ ఖన్నాకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న టీటీడీ అధికారులు

శ్రీవారిని దర్శించుకున్న సీజేఐ ఖన్నా

- సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికిన టీటీడీ ఈవో

హైదరాబాద్, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌కన్నా ఆదివారం ఉదయం తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. మొదటిసారిగా తిరుమలకు వచ్చిన జస్టిస్ సంజీవ్ ఖన్నాకు ఆలయ మహాద్వారం వద్ద టీటీడీ ఈవో జే శ్యామలరావు, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం అర్చకులు శేషవస్త్రం కప్పి, రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందజేశారు. తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

అభాగ్యులకు అండగా మాజీ ఎంపీ సంతోష్

- కృషి హోమ్‌కు రూ.2 లక్షలు విరాళం

మేడ్చల్ రూరల్, ఏప్రిల్ 6: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ గౌడవెల్లిలోని కృషి హోమ్ అనాథ పిల్లల ఆశ్రమానికి బీఆర్ఎస్ మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ తన ఉదారతను చాటుకున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకుని ఫిబ్రవరి 17న కృషి హోమ్‌ను సంతోష్‌రావు సందర్శించారు. అక్కడి పిల్లల బాగోగుల కోసం తన వంతు సాయంగా రూ.2 లక్షల విరాళాన్ని అందిస్తానని ఆనాడు ప్రకటించారు. తను ఇచ్చిన మాట ప్రకారం రూ 2 లక్షల చెక్కును ఆదివారం మేడ్చల్ నియోజకవర్గ గ్రీన్ ఇండియా చాలెంజ్ ఇన్‌చార్జి, బీఆర్ఎస్ పార్టీనేత మెట్టు శ్రీకాంత్‌రెడ్డి ద్వారా పంపించారు. కాగా అనాథ పిల్లల భవిష్యత్తు కోసం సహకారం అందించినందుకు సంతోష్‌కు ఆశ్రమ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.

మాజీ ఎంపీ సంతోష్‌రావు పంపించిన రూ.2 లక్షల చెక్కును కృషి హోమ్ ఆశ్రమ నిర్వాహకులకు అందజేస్తున్న బీఆర్ఎస్ నేత శ్రీకాంత్‌రెడ్డి

సమ్మెకు సమాయత్తం

- 7 ఆర్టీసీ సంఘాల సమాలోచన
- నేడు సమ్మె తేదీపై ప్రకటన!

హైదరాబాద్, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీలో సమ్మె జరిగే సూచనలు మెండుగా కనిపిస్తున్నాయి. ఆర్టీసీ కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె నోటీసులకు యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందనలేకపోవడంతో సోమవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని లేబర్ ఆఫీసులో 7 కార్మిక సంఘాలతో జేఏసీ సమ్మె సన్నాహక సమావేశం నిర్వహించనున్నది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘానికి జేఏసీ నేతలు సమాచారమిచ్చారు. దీంతో కార్మిక సంఘాలు సమ్మె తేదీ ప్రకటించే అవకాశమున్నది. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సమ్మెకు వెనుకాడబోమని ఇప్పటికే ఆర్టీసీ యూనియన్లు.. ఇటీవల ఆర్టీసీ యాజమాన్యానికి, లేబర్ కమిషనర్‌కు నోటీసులు ఇచ్చాయి. అయితే చర్చలకు ఆహ్వానించాల్సిన ఆర్టీసీ యాజమాన్యం తాత్సారం చేస్తుండటంతో సమ్మె అనివార్యమనే వాదనలు వినిపిస్తున్నాయి. తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె జరిగితే.. దానికి ఆర్టీసీ యాజమాన్యం, ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న (ఈయూ), జేఏసీ వైస్ చైర్మన్ మారంరెడ్డి థామస్ రెడ్డి (టీఎంయూ) తెలిపారు. కాగా, సమ్మెతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉండటంతో.. తమ సమ్మెకు మహిళా సంఘాలు, ప్రజా సంఘాలు, అన్ని యూనియన్లు కలిసిరావాలని వారు కోరుతున్నారు.

గిరిజన నేతలపై ఉక్కుపాదం!

- నేటి గిరిజన సంక్షేమ భవన్ ముట్టడిని అడ్డుకునేందుకు పోలీసుల ముందస్తు చర్యలు
- జేఏసీ నేతలకు ఫోన్లు చేసి మరీ ముట్టడికి వెళ్లవద్దని బెదిరింపులు

హైదరాబాద్, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ) : 2019-21 సంవత్సరాల్లో మంజూరైన ట్రైకార్ రుణాలకు సంబంధించి రూ.219 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గిరిజన సంఘాల జేఏసీ ఏడాదిగా డిమాండ్ చేస్తున్నది. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. తాజాగా రాజీవ్ యువవికాసం పథకం పేరిట సబ్సిడీ రుణాలు ఇస్తామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో తమకు గతంలో మంజూరైన ట్రైకార్ రుణాలు ఇవ్వాలని గిరిజన సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం 'చలో గిరిజన సంక్షేమ భవన్' ముట్టడికి జేఏసీ పిలుపునిచ్చింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ట్రైకార్ సంస్థ ద్వారా దాదాపు 30 వేల మంది గిరిజన యువతకు సబ్సిడీ రుణాలు అందించేందుకు రూ.219 కోట్ల చెక్కులను సిద్ధం చేసి క్లియరెన్స్ కోసం ఆర్థిక శాఖకు పంపిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని పక్కన పెట్టిందని, రాజీవ్ యువవికాసం పథకంలో మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా కల్పించలేదని, దీంతో గిరిజన యువత రుణాలు పొందలేని దుస్థితి నెలకొన్నదని గిరిజన సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో నేడు వేలాదిమందితో మాసబ్‌ట్యాంక్‌లోని గిరిజన సంక్షేమ భవన్ ముట్టడికి కార్యాచరణ ప్రకటించింది. అయితే, ఈ ముట్టడిని అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని, జేఏసీ నేతలకు ఫోన్లు చేసి కేసుల పేరిట బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. జిల్లాల నేతలను కూడా హైదరాబాద్‌కు రావొద్దని హెచ్చరికలు జారీ చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం తన పద్ధతిని మార్చుకోవాలని, రుణాలు విడుదల చేసేవరకు పోరాటం ఉధృతం చేస్తామని జేఏసీ నేతలు హెచ్చరిస్తున్నారు. మంజూరైన రుణాలను ఇవ్వకుండా మోసం చేయడమేగాక, ఇదేమని ప్రశ్నిస్తున్న గిరిజన సంఘాల నేతలపై కాంగ్రెస్ సర్కారు ఉక్కుపాదం మోపుతున్నదని మండిపడుతున్నారు.

కాళేశ్వరంపై సర్కారు కక్షసాధింపు

- వివక్షతోనే ప్రాజెక్టును ఎండబెట్టింది
- పిల్లర్ల మరమ్మతులు చేసి నీళ్లివ్వాలి
- కేసీఆర్ సిస్టం మొత్తం రెడీ చేసి కాంగ్రెస్ సర్కారు చేతికి ఇచ్చారు
- నేడు సరిగా వాడుకోలేకపోతున్నది
- నీళ్లున్నా.. పంటలెండుతున్నయ్
- సాగునీటి సరఫరాలో సర్కార్ నిర్లక్ష్యం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- సొంత డబ్బులతో బిక్కబండకుంటకు సాగునీటికాల్వ తవ్వకం
- స్వయంగా నీటి విడుదల.. జిల్లా రైతాంగం హర్షం



సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చౌడారంలో పైప్‌లైన్ ద్వారా నీటిని విడుదల చేసి పూజలు చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

చిన్నకోడూర్, ఏప్రిల్ 6: కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై వివక్ష చూపుతున్నదని, కక్షపూరితంగానే ఈ మెగా ప్రాజెక్టును ఎండబెడుతున్నదని బీఆర్ఎస్ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చౌడారం కాల్వ నుంచి మైలారం జాలి చెరువు బిక్కబండ కుంటకు సొంత డబ్బుతో హరీశ్‌రావు ఇటీవల కాల్వను తవ్వించారు. ఆదివారం రైతుల సమక్షంలో పైపులైన్ ద్వారా చెరువులోకి ఆయన నీటిని విడుదల చేశారు. దీంతో రైతులు సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వివక్షాపూరితంగానే.. కాళేశ్వరం ప్రాజెక్టు కింద కొత్తగా ఒక్క ఎకరా భూసేకరణకు నిధులు విడుదల చేయలేదని మండిపడ్డారు. ఈ వైఖరితోనే ప్రభుత్వం రైతులకు తీరని అన్యాయం చేస్తున్నదని ధ్వజమెత్తారు. కాళేశ్వరం రిజర్వాయర్లలో పుష్కలంగా నీళ్లున్నా నీటి విడుదలలో నిర్లక్ష్యం చూపుతుందని మండిపడ్డారు. ప్రభుత్వం నిధులు ఇవ్వక పోవడంతో రైతులే సొంతంగా కాల్వలు తవ్వుకునే పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం మొద్దునిద్ర వీడటం లేదని, ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఉద్దేశపూర్వకంగా కాళేశ్వరం ప్రాజెక్టు కింద కాల్వల నిర్మాణం, నీటి పంపింగ్ చేయడం లేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు, రంగనాయక సాగర్, కొండపోచమ్మ, మిడ్ మానేరులో నీళ్లున్నా.. కుట్రతోనే విడుదల చేయడం లేదని ధ్వజమెత్తారు. కేసీఆర్ నాడు కాళేశ్వరం మెగా ప్రాజెక్టును నిర్మించి, సిస్టం అంతా రెడీ చేసినట్టు తెలిపారు. కేవలం భూసేకరణ చేసి కాల్వలు తవ్వి రైతులకు నీళ్లు ఇవ్వాల్సి ఉండగా, అది మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం చేయడం లేదని మండిపడ్డారు. మైలారం జాలిచెరువు, కొండెంగులకుంట, బిక్కబండ పరిధిలో నీళ్లు లేక పంటలు ఎండుతున్నాయని ఇటీవల తనతో రైతులు మొరపెట్టుకున్నారని, పంటలు ఎండిపోవద్దని ఉద్దేశంతో తన సొంత డబ్బుతో కాల్వ పనులు చేయించినట్టు తెలిపారు. కండ్ల ముందు పంటలు ఎండుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టడం లేదని హరీశ్‌రావు విమర్శించారు. ఎలాంటి జాప్యం చేయకుండా కుంగిన ఒకటో, రెండో పిల్లర్లను మరమ్మతులు చేసి కాళేశ్వరం నీళ్లిచ్చి పంటలు కాపాడాలని హరీశ్‌రావు కోరారు. కార్యక్రమంలో నాయకులు మాజీ ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, పరకాల మల్లేశంగౌడ్, సత్యనారాయణరెడ్డి, మేడికాయల వెంకటేశం, పోచబోయిన శ్రీహరియాదవ్, పెట్టబోయిన శ్రీనివాస్, కాల్వ ఎల్లయ్య, ఏంరెడ్డి భూమిరెడ్డి, జంగిటి శ్రీనివాస్, కొండం రవీందర్‌రెడ్డి, ముక్కెర శ్రీనివాస్, మొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పదేండ్ల ప్రగతిని ఏడాదిలో దెబ్బతీశారు

హైదరాబాద్, ఏప్రిల్ 6 (నమస్తేతెలంగాణ): 'బీఆర్ఎస్ పాలనలోని పదేండ్ల ప్రగతిని నేడు కాంగ్రెస్ సర్కారు ఏడాదిలోనే దెబ్బతీసిందని బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావు ఒక ప్రకటనలో విమర్శించారు. 2024-25లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఆదాయంలో తగ్గుదలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. రేవంత్ ప్రభుత్వం అనాలోచిత విధానాలతో రాష్ట్రం అధోగతి పాలవుతున్నదని మండిపడ్డారు.ఉ బీఆర్ఎస్ హయాంలో కొవిడ్ కాలం మినహా రిజిస్ట్రేషన్ల శాఖ వార్షిక వృద్ధిరేటు 25.62 శాతం ఉండేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 1.93 శాతం తగ్గిందని తెలిపారు. హైదరాబాద్ ప్రతిష్ఠను దెబ్బతీయడంతోనే ఆదాయంలో తగ్గుదల నమోదైందని తెలిపారు. నాడు వేగంగా ఎదిగిన తెలంగాణ.. కాంగ్రెస్ సర్కార్ తొందరపాటు నిర్ణయాలతో నేడు వెనుకబాటుకు గురయ్యే పరిస్థితి దాపురించిందని దుయ్యబట్టారు.

రెండు రోజులు వర్షాలు

- హైదరాబాద్ వాతావరణ కేంద్రం

హైదరాబాద్, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నేడు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఈదురుగాలులతో కూడిన వడగండ్లు కురిసే అవకాశముందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోమవారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగామ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుందని పేర్కొన్నారు. రేపు జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, హన్మకొండ, జనగామ, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు పడే అవకాశముందని వెల్లడించారు.

జాతీయ రహదారులకు సహకరించండి

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖ
- బీఆర్ఎస్ హయాంలో వేగంగా హైవేల నిర్మాణం
- కిషన్‌రెడ్డి లేఖతో వాస్తవం వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో జాతీయ రహదారుల నిర్మాణానికి సహకరించాలని సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం బహిరంగ లేఖ రాశారు. జాతీయ రహదారుల కోసం వెంటనే భూసేకరణను పూర్తిచేయాలని విజ్ఞప్తిచేశారు. 2,500 కిలోమీటర్ల నిర్మాణానికి సంబంధించిన ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. వీటి కోసం 1,550 హెక్టార్ల భూమి అవసరమున్నదని, కేంద్ర ప్రభుత్వ అధికారులు రాష్ట్రప్రభుత్వానికి చాలాసార్లు లేఖలు రాశారని, కానీ ప్రభుత్వం 904 హెక్టార్ల భూమి మాత్రమే స్వాధీనం చేసిందని తెలిపారు.

బీఆర్ఎస్ హయాంలోనే వేగంగా

రాష్ట్రంలో బీఆర్ఎస్ హయాంలో జాతీయ రహదారుల నిర్మాణం వేగంగా జరిగిందనే విషయం కిషన్‌రెడ్డి లేఖ ద్వారా స్పష్టమైంది. 2014 వరకు 2,500 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు నిర్మిస్తే, 2014 నుంచి పదేండ్లలో 2,500 కిలోమీర్ల మేర నేషనల్ హైవేలు నిర్మించారని కిషన్‌రెడ్డి లేఖలో పేర్కొనడమే ఇందుకు నిదర్శనం. కానీ ఇటీవల మంత్రి కోమటిరెడ్డి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో ఒక్క జాతీయ రహదారి కూడా నిర్మించలేదని ఆరోపించారు. కోమటిరెడ్డి వ్యాఖ్యలు తప్పు అనే విషయం ఈ లేఖతో రుజువైందని చర్చ జరుగుతున్నది.

అర్చకుడిపై కాంగ్రెస్ కార్పొరేటర్ దౌర్జన్యం

- వరంగల్ నగరంలో ఘటన

వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 6: వరంగల్ నగరంలోని గోవిందరాజస్వామి ఆలయ ప్రధానార్చకుడిని కాంగ్రెస్ కార్పొరేటర్ అసభ్య పదజాలంతో దూషించాడు. శ్రీదేవి, భూదేవి, నీలాదేవి సహిత గోవిందరాజస్వామి తిరుకళ్యాణోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు చేసుకుంటున్న ఆలయ అనువంశీయ అర్చకుడు వరయోగుల శ్రీనివాసస్వామిని అడ్డుకుంటూ మరో అర్చకుడితో కల్యాణోత్సవాన్ని నిర్వహించాలని కార్పొరేటర్ అనిల్‌కుమార్ అదేశించాడు. శ్రీనివాసస్వామిని దూషిస్తూ ఆలయంలోకి రాకుండా చేస్తానంటూ బెదిరించాడు. ఆలయ అర్చకులు కలుగజేసుకొని తిరుకల్యాణోత్సవాన్ని కొనసాగించారు. ఆలయంలో రాజకీయ కార్యక్రమాలు జరుగుతున్నాయని అనంతరం అర్చకుడు శ్రీనివాసస్వామిని తెలిపారు.

జనరల్ ఎస్సేలో టాపర్‌ను దాటేసి!

మొదటిపేజీ తరువాయి...

తెలుగు మీడియం అభ్యర్థికి ఏకంగా 97.5 మార్కులేశారు. గ్రూప్-1 మెయిన్స్ స్టేట్ టాపర్‌కు వచ్చిన మార్కులు 150కి వచ్చింది 65.5 మార్కులే. కానీ ఆ తెలుగు మీడియం కాని అభ్యర్థికి ఏకంగా 97.5 మార్కులొచ్చాయి. అనధికారిక సమాచారం మేరకు జనరల్ ఎస్సే పేపర్‌లో ఇవే అత్యధిక మార్కులు. మరీ విశేషమేంటంటే సదరు అభ్యర్థికి 6 పేపర్లల్లో వచ్చిన మార్కులతో పోల్చితే, జనరల్ ఎస్సేలోనే అత్యధికంగా మార్కులొచ్చాయి. మిగతా ఏ పేపర్‌లోనూ 90 మార్కులు దాటలేదు. స్టేట్ టాపర్ కంటే సదరు అభ్యర్థికి ఒకే పేపర్‌లో 31.5 మార్కులు అత్యధికంగా రావడం గమనార్హం. సివిల్స్‌లో సాధ్యంకాని మార్కులు గ్రూప్-1లో ఎలా సాధ్యమని, మరీ ముఖ్యంగా స్టేట్ టాపర్ కన్నా ఎక్కువ మార్కులెలా వచ్చాయని తోటి అభ్యర్థులే ప్రశ్నిస్తున్నారు. ఇలా రావడం వెనుక ఏదో లోగుట్టు ఉన్నదని అభ్యర్థులు అనుమానిస్తున్నారు. గ్రూప్-1 మెయిన్స్ మూల్యాంకనంలో లోపాలున్నాయనడానికి ఇదే నిదర్శమని పలువురు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు.

తెలుగు మీడియం అభ్యర్థులకు అన్యాయం

ఖమ్మం జిల్లాకు చెందిన ఓ మహిళా అభ్యర్థి హైదరాబాద్ అశోక్‌నగర్‌లోని ఓ అకాడమీలో కోచింగ్‌తోపాటు, ప్రాక్టీస్ కోసం టెస్ట్ సిరీస్ తీసుకున్నది. అకాడమీలో రోజూ 50కిపైగా అభ్యర్థులు టెస్ట్ సిరీస్ రాసేవారు. రోజూ ఆ మహిళా అభ్యర్థికి 15 మార్కుల ప్రశ్నకు 6 మార్కులొచ్చేవి. అదే కోచింగ్ సెంటర్‌లోని మిగతా వారికి 3 మార్కులకు మించకపోయేవి. ఇలాగే 4 నెలలపాటు జరిగింది. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను సదరు అభ్యర్థి తెలుగులో రాయగా, మిగతా వాళ్లంతా ఇంగ్లిష్ మీడియంలో రాశారు. తీరా మెయిన్స్ జీఆర్ఎల్ చూస్తే అవాక్కవడం సదరు తెలుగు మీడియం అభ్యర్థి వంతైంది. తెలుగులో పరీక్ష రాసిన ఆ అభ్యర్థి జీఆర్ఎల్ ర్యాంకు 3వేలలోపు ఉంటే, ఇంగ్లిష్ మీడియంలో రాసిన వారేమో 300 ర్యాంకులోపే ఉన్నారు. తెలుగులో మెయిన్స్‌లో రాయడమే ఆ అభ్యర్థి చేసిన తప్పయింది. ఇలాంటి అనేకం ఉదాహరణలను అభ్యర్థులు ఆధారాలుగా చూపుతున్నారు. గ్రూప్-1 మెయిన్స్‌ను తెలుగు మీడియంలో రాసిన వారికి అన్యాయం జరిగిందని, ఇంగ్లిష్ మీడియంలో రాసిన వారికి ఎక్కువ మార్కులు వేశారని వారంతా వాదిస్తున్నారు.

అభ్యర్థుల వరుసలు	అభ్యర్థుల సంఖ్య
పక్క పక్కనున్నవాళ్లు మధ్యలో ఒకరు తప్ప	654
ముందు, వెనుక గల వారు	702
మధ్యలో ఇద్దరు తప్ప	64
మధ్యలో ముగ్గురు తప్ప	52

ఉత్తుత్తి మార్కులేశారా?

గ్రూప్-1 జీఆర్ఎల్‌ను పరిశీలిస్తే అనేక లోపాలు బయటపడుతున్నాయి. ఒకరికో ఇద్దరికో ఒకే తరహా మార్కులు రావడం సహజం.. కానీ గ్రూప్-1లో 1,472 మంది అభ్యర్థులకు ఒకే స్థాయి మార్కులు వచ్చాయి. వీరిలో పక్కనే పరీక్షలు రాసిన వారు, బెంచీ విడిచి మరో బెంచీలో ఉన్న వాళ్లు ఉన్నారు. మరీ ముఖ్యంగా పక్క పక్క బెంచీల్లో ఉన్న వారికి సేమ్ మార్కులు వచ్చాయి. మధ్యలో ఒకరిని వదిలి ముందు వెనుకున్న వాళ్లకూ ఒకే మార్కులు వచ్చాయి. మధ్యలో ఇద్దరిని తప్పించి సేమ్ మార్కులొచ్చిన వారు, మధ్యలో ముగ్గురిని తప్పించి, నలుగురిని తప్పించి ఒకే మార్కులు వచ్చిన వాళ్లు అనేకం. నిజంగా పేపర్లు దిద్దిండ్రా.. లేక ఉత్తుత్తిగానే మార్కులేసిండ్రా అన్న భావన కలిగేలా పలువురి మార్కులు ఉండటం గమనార్హం. ఒక సెంటర్‌లో 41 మందిలో 20 మంది అభ్యర్థులకు 400కు పైగా మార్కులు చ్చాయి. దీన్నిబట్టి చూస్తే వరుసబెట్టి మార్కులు వేసినట్టుగా అనిపిస్తున్నది. ఒకేతరహా మార్కులు రావడం ఎలా సాధ్యమని అభ్యర్థులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఈ లెక్కన గ్రూప్-1 మెయిన్స్ జవాబుపత్రాలను నిజంగానే మూల్యాంకనం చేశారా, లేక మూల్యాంకనం చేయకుండా మార్కులేశారా? అని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం అరిగోస!

- ఆర్థిక ఇబ్బందులతో అంగన్‌వాడీల అష్టకష్టాలు
- తొమ్మిది నెలలుగా ఏడు వేల మంది ఎదురుచూపులు
- మంత్రులు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం శూన్యం

హైదరాబాద్, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం రిటైర్డ్‌మెంట్ అంగన్‌వాడీలపై తీవ్ర వివక్షత చూపిస్తున్నది. దీంతో పదవీ విరమణ పొంది తొమ్మిది నెలలు అవుతున్నా.. రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ రాకపోవడంతో ఏడువేలమంది అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఆర్థికంగా అష్టకష్టాలు పడుతున్నారు. కుటుంబాన్ని నెట్టుకొచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రిటైర్డ్ బెనిఫిట్స్ కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం శూన్యమని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

కాంగ్రెస్ హామీలు ఘనం..అమలు శూన్యం..

కాంగ్రెస్ ఎన్నికల ముందు అంగన్‌వాడీ టీచర్లకు రూ.18 వేలు వేతనం ఇస్తామని ప్రకటించింది. టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష చొప్పున రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ ఇస్తామని మ్యానిఫెస్టోలో పేర్కొన్నది. కానీ ఇప్పుడు అమలు చేయడం లేదు. 2024 జూలై 1నుంచి విరమణ పే